# జిల్లాలో మెండుగా ఎఫ్.డి.ఆర్ పనులకు గ్రీన్ సిగ్నల్

- పలువురు తమ్ముళ్లు కళ్ళల్లో హుషార్
- వర్కులు దక్కని తమ్ముళ్లలో అసంతృప్తి
- పాత పనులకు బిల్లులు చేసే క్రమంలో అధికారుల జోరుపై విమర్శలు
- ఎఫ్.డి.ఆర్ పనులపై పలువురు తమ్ముళ్లు పెదవి విరుపు

**నెల్లూరు, ఏప్రిల్ 10 వుదయం ప్రతినిధి:**

రాష్ట్ర ప్రభుత్వం ప్రజలు, రైతుల అవసరాల నిమిత్తం ఎఫ్ డి ఆర్ పనులకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. అందులో భాగంగా నెల్లూరు జిల్లాలో భారీగానే ఎఫ్ డి ఆర్ (ఫ్లడ్స్ డ్యామేజ్ రిపేర్లు) కొరకు పనులను చేయించాలనే క్రమంలో అధికార యంత్రాంగానికి ఇరిగేషన్ ద్వారా గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ పనులు టెండర్ల ద్వారా కొన్ని పనులు, నామినేటెడ్ పనుల ద్వారా కొన్ని పనులు ఇస్తున్నట్లు తెలిసింది. అయితే ఈ పనులను చెరువు, నీటి సంఘం సభ్యుల ద్వారా పనులు చేయించే అవకాశం కనిపిస్తుంది. అంతేకాకుండా మరి కొంతమందికి కూడా ఆయా మండలాల్లో కష్టించి పనిచేస్తున్న తమ్ముళ్లకు ఈ పనులు దక్కుతున్నట్లు తెలిసింది. ప్రభుత్వం నుండి జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో, అన్ని మండలాల్లో, ఆయా పంచాయితీలలో వర్కులను ఆయా వ్యక్తుల పేర్ల మీద జాబితా సిద్ధం చేసినట్లు తెలుస్తుంది. అయితే ఈ వర్కులు తెలుగు తమ్ముళ్ల కళ్ళల్లో హుషారు నింపే విధంగా కనిపిస్తుంది. పాలకుల కనుసన్నల్లో నిజాయితీపరులుగా కనిపెట్టుకొని ఉన్నవారికి ఈ అవకాశాలు దక్కినట్లు తెలుస్తుంది. ఈ వర్క్ లకు గ్రీన్ సిగ్నల్ రావడంతో తెలుగు తమ్ముళ్లలో సంతోషం ఎక్కువైంది అని తెలుస్తుంది. ప్రజలు రైతుల అవసరాల కోసం ప్రభుత్వం చేసే ఈ పనులు తో ఎంతైనా ప్రయోజనకరంగా ఉంటుందని ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అయితే ఈ వర్క్ లను పొందలేని పలువురి తమ్ముళ్లు కళ్ళల్లో ఆవేదనతో నిండినట్లు తెలుస్తుంది. అలాగే ఈ వర్క్ లపై విమర్శలు కూడా వినిపిస్తున్నాయి. ఇప్పటికే ఈ వర్కులు అగ్రిమెంట్లు చేసుకునే పొజిషన్లో ఉన్నట్లు తెలుస్తుంది. అయితే ఈ పనులపై పలు విమర్శలు కూడా వెల్లువెత్తుతున్నాయి. ఆయా సందర్భాలలో ఆయా గ్రామీణ ప్రాంతాలలో పొలాలు నీటి కాలువలు దెబ్బతిన్న సందర్భాల్లో రైతులు స్వచ్ఛందంగా పనులు పూనుకొని చేసుకున్న సందర్భాలు కూడా ఉన్నాయి అని, అలాంటి పాత పనులను కూడా ఈ ఎఫ్ డి ఆర్ పనులు దక్కించుకున్న గుత్తేదారులు ఇరిగేషన్ ఏఈ లతో కొమ్మక్కై నూతన బిల్లులు చేసుకుంటున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. క్వాలిటీ కంట్రోల్ వారి నుంచి నామమాత్రంగా సర్టిఫికెట్లు తెచ్చి పొందపరిచి అధికారులతో కుమ్మక్కై పాత పనులకు బిల్లులు చేసుకొని ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసే పరిస్థితులు ఉన్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ పనుల తీరుపై ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి పెట్టి ప్రజలకు, రైతులకు ప్రయోజనకరంగా ఈ పనులు జరిగే విధంగా చూడాలని రైతులు, ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై జిల్లాలో ఎఫ్.డి.ఆర్ పనుల వివరాలు తెలుసుకునే క్రమంలో ఇరిగేషన్ ఎస్ఈ నీ కాంటాక్ట్ చేయగా అందుబాటులో లేని కారణంగా, అందుబాటులో ఉన్న కావలి డిఈ/ఇఇ ముజాహిద్దీన్ ఖాన్ ను వుదయం ప్రతినిధి కాంటాక్ట్ చేయడం జరిగింది. కావలి డివిజన్లోని తన పరిధిలో ఉన్న మండలాల్లో సుమారు 26 కోట్ల రూపాయల ఎఫ్.డి.ఆర్ పనులు వచ్చినట్లు తెలిపారు.

# ఉత్తరుని ప్రగల్భాలు పలుక వద్దు

- మరో కేసులో ఇరుక్కోవాలని ఉందా..?
- మేము నిజాయితీపరుని అడుగు జాడల్లో నడుస్తున్నాము !
- జాగ్రత్తగా మాట్లాడు
- సొసైటీ అధ్యక్షుడు చిలకపాటి వెంకటేశ్వర్లు..

**కావలి (బోగోలు), ఏప్రిల్ 10, వుదయం ప్రతినిధి:**



బోగోలు మండలంలో నా అంతటి వాడు, నీతిపరుడు లేడనీ డంబాలు కొట్టుకుంటూ ఉత్తరుని ప్రగడ్బాలు పలకడం మానుకోవాలని బోగోలు మండలం వైసీపీ అధ్యక్షుడు మద్దిబోయిన వీర రఘు పై, అదే మండలానికి చెందిన టిడిపి సొసైటీ అధ్యక్షుడు చిలకపాటి వెంకటేశ్వర్లు ఘాటైన వ్యాఖ్యలు చేశారు. శుక్రవారం బోగోలు మండలం టిడిపి కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నిన్నటి రోజున వైసీపీ మండల కన్వీనర్ వీర రఘు తమపై అనవసరపు మాటలు పలికారని, అందుకు ఈ సమావేశంలో ఈ రీతిగా స్పందిస్తున్నట్లు తెలిపారు. బోగోలు మండలం నకు 1450 టన్నుల యూరియా వస్తే అందులో 1000 టన్నుల యూరియాను చిలకపాటి వెంకటేశ్వర్లు తినేశాడు అని ఆరోపించడం సరికాదన్నారు. తమ సొసైటీకి వచ్చింది 240 టన్నులు అని, 1210 టన్నులు యూరియా ఆర్ బి కే లకు వచ్చింది అన్నారు. వీర రఘు రాజకీయ జీవితంలో ఆర్.ఎస్.కే, ఆర్ బి కే, సొసైటీ లకు తేడా తెలియకుండా మాట్లాడటం సబబు కాదన్నారు. ఇలా మాట్లాడుతుంటే ఈ ఎండలకు 'మావోలు' తిని తిని తల తిరిగి రఘు మాట్లాడుతున్నాడేమో అనే అనుమానం వస్తుందన్నారు. గుడ్డ కాల్చి ఎదుటివారి ముఖాన వేస్తే సరిపోతుందిలే అనుకుంటే పొరపాటు అని, ఇప్పటికే ఒక ప్రైవేటు కేసులో ఉన్న విషయం గుర్తించుకోవాలన్నారు. మరో కేసు కోసం ఎదురుచూస్తున్నట్లు ఆయన తీరు కనిపిస్తుందని విమర్శించారు. ఆర్ఎస్కే లకు గవర్నమెంట్ అన్ని కూలీలతో కలిపి పంపుతుంది అన్నారు. అదే సొసైటీలకు పంపించే యూరియాకు తామే డీడీలు, కూలీలు కట్టాలని తెలిపారు. 18 టన్నుల యూరియా 400 లు కట్టలు వస్తుందన్నారు. తమ సొసైటీ ద్వారా రైతు ఉంటే మిషన్ లోనే బిల్లు కట్టి ఇస్తాము అని, రైతు లేకపోతే ఫోన్ ద్వారా ఓటిపి తెలుసుకొని అందజేస్తామన్నారు. రైతులకు తెలియకుండా యూరియా బయటికి పోదు అన్న విషయాన్ని గుర్తించుకోవాలన్నారు. కౌలుదారునికి తాము ఇవ్వడానికి పూర్తి హక్కులు ఉన్నాయి అన్నారు. ఇలాంటి విషయాలపై పరిజ్ఞానం లేకుండా రాజకీయ అనుభవం ఉందని చెప్పుకుంటూ సిగ్గులేని మాటలు, ఎదుటివారిపై బురద చల్లే మాటలు మానాలని హెచ్చరించారు. బోగోలు మండలంలో 20వేల ఎకరాల భూమి ఉందని వీటన్నిటికీ తాము యూరియా సొసైటీ ల నుంచి ఇచ్చేందుకు అర్హులమని గుర్తు చేశారు. ఎక్కడెక్కడో జరిగిన అంశాలను సంబంధం లేకుండా మాపై రుద్దడం అవగాహన రహితం అన్నారు. ఆర్ఎస్కే లను మాకు పూసి మాట్లాడటం మీ అవిధేత అన్నారు. నీకు దమ్ముంటే ఉత్తరుని ప్రగడ్బాలు మానుకొని, సక్రమంగా తెలుసుకోవాలన్నారు. తాము నిజాయితీ పరుడైన కావలి శాసనసభ్యులు కృష్ణారెడ్డి అడుగుజాడల్లో పయనిస్తున్నాం అనేది గుర్తుంచుకోవాలన్నారు. నీకు తెలిసిన ఆ మల్లారెడ్డి ఒక్కడినే దృష్టిలో పెట్టుకుని మాట్లాడటం మానుకోవాలన్నారు. అయ్యా మల్లారెడ్డి నీవు అయినా కూడా ఆ వీర రఘు కి అర్థమయ్యే విధంగా బుద్ధి చెప్పాలని గుర్తు చేశారు. తమ సొసైటీ ద్వారా ఎక్కువ రేట్లు అమ్ముతున్నారని చెప్పడం సిగ్గుచేటు అన్నారు. ఈ సత్య హరిశ్చంద్రుడైన ఉత్తర కుమారుడు వీర రఘు నీతి ఏంటో నాకు క్షుణ్ణంగా తెలుసని, ఆయన గురించి వివరించారు. గత ప్రభుత్వంలో సీఎంఆర్ ధాన్యాన్ని కొనుగోలు చేశారన్నారనీ. లక్షల్లో ఆదాయం పొందారని, ఒక్కొక్క లోడును లక్ష నుంచి 1,20,000 కు అమ్మి తన గ్రూపులో ఉన్న ఆర్ బి కే అసిస్టెంట్లను నలుగురిని సస్పెండ్ చేయించిన ఘనత వీర రఘు నకే దక్కిందన్నారు. వారైతే సస్పెండ్ అయ్యారు గానీ, వీర రఘు మాత్రం 80 లక్షల రూపాయలు భారీగా సిఎంఆర్ లో అవినీతికి పాల్పడ్డారని గుర్తు చేశారు. అదంతా కూడా మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ కుమార్ రెడ్డి కనుసన్నల్లో జరిగిందని ఆరోపించారు. అప్పట్లోనే పార్టీ నుంచి తప్పించకుండా చెడ్డ పేరు వస్తుందనే ఉద్దేశంతో, మరొకరిని పెట్టి కొనసాగించారన్నారు. నీవు కూడా మాపై నీతులు చెప్తావా అని ఎద్దేవా చేశారు. వైయస్సార్ జగనన్న ఇండ్ల ప్లాట్లు పేదలకు 9 అంకణాలు ఇస్తే, అధికారాన్ని అడ్డుపెట్టుకొని, అధికారులను బెదిరించి 50 అంకణాల స్థలం సేకరించి తన భార్య పేరున గోడౌన్ కట్టిన విషయాన్ని గుర్తు చేశారు. ఆ గోడౌన్ ను తమ గవర్నమెంట్ లో పగలగొట్టిన అంశం గుర్తు చేశారు. వాటి విషయం నోరెత్తలేని వీర రఘు ఉత్తరుని మాటలు ఆపి బ్రతకడం నేర్చు కోవాలన్నారు. బోగోలు.2 సచివాలయ నిర్మాణం కోసం కట్టిస్తానని పనులు చేయించకుండా రెండు లక్షల రూపాయలు అడ్వాన్స్ తీసుకొని వదిలేసిన విషయం గుర్తు చేశారు. ఎం బుక్ రికార్డు కింద లక్ష రూపాయల కట్టినట్లు గుర్తు చేశారు. నీవు కూడా నీతిపరుడు అని చెప్పుకోవడం తగునా, అని విమర్శలు చేశారు. హర్ష కారు వైసిపి గవర్నమెంట్ ఉందని కారు కొనుగోలు చేశావు కదా, నీకు తెల్ల రేషన్ కార్డు ఎందుకు అని గుర్తు చేశారు. అందుకనే ఆ కార్డును తొలగించడానికి నీపై అర్జీ పెట్టినట్లు గుర్తు చేశారు. నీవు నాపై మాట్లాడే అర్హత కోల్పోయావని హెచ్చరించాడు. ఇప్పటికైనా బుద్ధి తెచ్చుకొని ఎదుటివారిపై బురద చల్లడం మానుకోవాలని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ పిఎసిఎస్ చైర్మన్ ఎర్రం వెంకటేశ్వర్ రెడ్డి, గనిపినేని నాగరాజు, రఘురాముల నాయుడు, పుట్టా సుబ్బారావు, బోగోలు చెరువు అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, బోగోల చెరువు ఉపాధ్యక్షుడు చేబ్రోలు శ్రీధర్, రైతులు మరియు టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# మసీదును పరిశీలించిన ఎమ్మెల్యే కావ్య క్రిష్ణారెడ్డి

**కావలి, ఏప్రిల్ 10, వుదయం ప్రతినిధి:**

కావలి రూరల్ మండలం రాజువారి చింతలపాలెం గ్రామంలో ఇటీవల నిర్మించిన నూతన మసీదును కావలి శాసనసభ్యులు కావ్య క్రిష్ణారెడ్డి సందర్శించారు. మసీదు వద్దకు చేరుకున్న ఎమ్మెల్యేకు ముస్లిం పెద్దలు, గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ముస్లిం పెద్దలు ఎమ్మెల్యేకు ప్రత్యేక దువా నిర్వహించి నియోజకవర్గ ప్రజ శ్రేయస్సు కోసం ప్రార్థనలు చేశారు.మసీదు నిర్మాణం మరియు అక్కడి సౌకర్యాలను ఎమ్మెల్యే ముస్లిం పెద్దలతో కలిసి పరిశీలించారు.మసీదు గ్రామంలోని ముస్లిం సోదరులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. భవిష్యత్తులో మసీదు అభివృద్ధికి అవసరమైన సహాయం అందించేందుకు తాను ఎప్పుడూ సిద్ధంగా ఉంటానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, గ్రామ పెద్దలు, ముస్లిం సోదరులు మరియు మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# యువతే మన దేశానికి శక్తి




- వైబ్రంట్స్ ఆఫ్ కలాం అధ్యక్షులు విజయ్ కలాం

**కావలి, ఏప్రిల్ 10, వుదయం ప్రతినిధి:**

మాదక ద్రవ్యాలు మానవ శరీరానికి మిక్కిలి హాని కలిగించేవని, మాదక ద్రవ్యాల వాడకం ఒక ప్రమాదమైన వ్యసనమని వైబ్రంట్స్ ఆఫ్ కలాం వ్యవస్థాపక అధ్యక్షులు విజయ్ కలాం అన్నారు. దండి మార్చ్ 2.0 డ్రగ్ ఫ్రీ ఆంధ్రప్రదేశ్ సైకిల్ యాత్ర 5 వ రోజు కావలి నియోజకవర్గం కడనూతల ఆర్ ఎస్ ఆర్ ఇంజనీరింగ్ కళాశాల వరకు సాగింది. ఆర్ఎస్ఆర్ కళాశాల కాన్ఫరెన్స్ హాల్లో ఇంజనీరింగ్ విద్యార్థులకు మాదకద్రవ్యాల నిర్మూలనపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వైబ్రంట్స్ ఆఫ్ కలాం వ్యవస్థాపక అధ్యక్షులు విజయ్ కలాం మాట్లాడుతూ ఈ నెల ఆరోవ తేదీ నుండి తిరుపతి ఎస్వీ యూనివర్సిటీ క్యాంపస్ ప్రారంభం అయిన సైకిల్ యాత్ర ఐదోవా రోజు కావలి 200 కి.మీ చేరుకుందని తిరుపతి నుండి వైజాగ్ వరకు 13 జిల్లాల మీదుగా 1000కి.మీ 17 రోజుల పాటు సైకిల్ యాత్ర జరుగుతుందని ఆయన అన్నారు. ఈగల టీం సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ రాజీవ్ కుమార్ మాట్లాడుతూ మాదకద్రవ్యాలను అరికట్టటకు ప్రతి ఒక్కరూ సహకరించాలని,మాదక ద్రవ్యాలలో వివిధ రకాలున్నాయని నల్ల మందు, మార్ఫిన్, హెరాయిన్, చరస్, గంజాయి, మారిజువానా, కొకైన్, ఎల్.ఎస్.డి. మొదలైనవిగా మనం వింటున్నాం,అది అరికట్టాల్సిన బాధ్యత మనందరిపై ఉందని దీనికి టోల్ ఫ్రీ నెంబర్ 1972 కాల్ చెయ్యాలని ఆయన అన్నారు.ఆర్ఎస్ ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ సివియన్ రెడ్డి మాట్లాడుతూ ఈనాటి యువతరాన్ని దారి మళ్ళించి చెడు మార్గాల్లో నడిపిస్తున్న దురలవాట్లలో మాదక ద్రవ్యాల వినియోగం తీవ్రమైనదని ఆయన అన్నారు. అనంతరం కళాశాల ఆవరణంలో 100 అడుగుల జాతీయ జెండాను ప్రదర్శన చేశారు ,ఈ సైకిల్ యాత్ర లో విజయ్ కలాం (ఫౌండర్) భాస్కర్ ,ఓరగంటి రంజిత్, రవి రేపాకుల,శ్రీను తోళ్ల, జహీర్ పాషా,ఫయాజ్ చేస్తున్న 7 టీం సభ్యులు వైబ్రంట్స్ ఆఫ్ కలాం రాష్ట్ర కో ఆర్డినేటర్ రవి రాజు, జిల్లా కో ఆర్డినేటర్ డాక్టర్ చేవూరు చిన్న, ఈగల్ సెల్ నెల్లూరు టీమ్ ఫిరోజ్,సుభాని పాల్గొన్నారు.

# గ్రామీణ మహిళల ఆర్థిక స్వావలంబనకు కృషి

- కావలి ఎమ్మెల్యే కావ్య క్రిష్ణారెడ్డి వెల్లడి
- మహిళలకు మగ్గం వర్క్ ట్రైనింగ్ సెంటర్ ప్రారంభించిన ఎమ్మెల్యే

**కావలి, ఏప్రిల్ 10, వుదయం ప్రతినిధి:**




గ్రామీణ మహిళల ఆర్థిక స్వావలంబనకు బలమైన పునాది వేయాలనే లక్ష్యంతో ఎంబ్రాయిడింగ్, అల్లికలు, పెయింటింగ్ వంటి చేతివృత్తులపై ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి తెలిపారు. శుక్రవారం కావలి పట్టణంలోని వెలుగు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మహిళల మగ్గం వర్క్ ట్రైనింగ్ సెంటర్ ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ హ్యాండ్‌మేడ్ ఉత్పత్తులకు ఈ రోజుల్లో మార్కెట్ లో మంచి డిమాండ్ ఉందన్నారు. యంత్రాలతో తయారైన వస్తువులతో పోలిస్తే చేతితో చేసిన ప్రతి వస్తువుకూ ప్రత్యేకత, నాణ్యత, భావోద్వేగ విలువ ఉంటుందని చెప్పారు. మన చేతితో వండిన ఆహారం ఎంత రుచిగా ఉంటుందో, అలాగే చేతితో చేసిన వస్తువులకు కూడా అంతే విలువ ఉంటుందని ఆయన అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో అనేక కారణాల వల్ల చదువు కొనసాగించలేకపోయిన మహిళలు కూడా జీవితంలో వెనుకబడిపోకుండా, ఈ శిక్షణల ద్వారా కొత్త అవకాశాలను అందిపుచ్చుకోవాలని ఆయన సూచించారు. వివాహం తర్వాత కూడా మహిళలు తమ ప్రతిభను నిరూపించుకునే అవకాశాలు ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. స్వయం సహాయక సంఘాల ద్వారా అమలవుతున్న పొదుపు ఉద్యమం మహిళలకు ఆర్థిక బలం ఇచ్చిందని, 1999లో నెల్లూరు జిల్లాలో ప్రారంభమైన ఈ ఉద్యమం దేశవ్యాప్తంగా విస్తరించడం గర్వకారణమని ఆయన పేర్కొన్నారు. ఈ సంఘాల ద్వారా మహిళలు కేవలం పొదుపు మాత్రమే కాకుండా, వ్యాపార దిశగా కూడా అడుగులు వేస్తున్నారని తెలిపారు. శిక్షణ కోసం దూర ప్రాంతమైన కరీంనగర్ నుంచి నిపుణులను తీసుకువచ్చి మహిళలకు ప్రత్యక్షంగా శిక్షణ ఇస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు. మండల స్థాయి అధికారులు, ఏపీఎంలు, సిబ్బంది, సంఘ నాయకుల సమన్వయంతో ఈ కార్యక్రమం విజయవంతంగా సాగుతోందని చెప్పారు. ఆకర్షణీయంగా ఉంచిన వస్తువులు వినియోగదారులను వెంటనే ఆకట్టుకుంటాయని, నేటి వినియోగ సంస్కృతిలో అన్ ప్లాన్డ్ కొనుగోళ్లు పెరుగుతున్నాయని తెలిపారు. మాల్స్, షాపింగ్ సెంటర్లలో డిస్ప్లే కీలక పాత్ర పోషిస్తోందని చెప్పారు. పెద్ద నగరాల్లో బోటిక్‌ల పేరుతో చేతితో తయారైన బ్లౌజులు, డిజైన్లు రూ.10,000 నుంచి రూ.50,000 వరకు అమ్ముడవుతున్నాయని అన్నారు. గ్రామీణ మహిళలు కూడా చిన్న యూనిట్లు ఏర్పాటు చేసి, కలసికట్టుగా పనిచేస్తే మంచి ఆదాయం పొందవచ్చని సూచించారు. నేర్చుకున్న కళలను ఇతరులకు పంచి, మరింత మందికి ఉపాధి అవకాశాలు కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపిఎం కృష్ణారావు, సిసి రసూల్, ట్రైనర్, ట్రైనింగ్ సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు..

# డ్రైనేజీ సమస్యలపై తక్షణ చర్య

**విజయవాడ ఏప్రిల్ 10 వుదయం ప్రతినిధి:-**



విజయవాడ నగరంలోని రాణిగారి తోట 18వ డివిజన్ ప్రాంతంలో ఈ రోజు టీడీపీ యువ నాయకులు గద్దె క్రాంతి కుమార్ పర్యటించారు. ఈ సందర్భంగా కరెంట్ ఆఫీస్ వద్ద పొంగిపొర్లుతున్న డ్రైనేజీలను స్వయంగా పరిశీలించారు. స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తెలుసుకుని వెంటనే స్పందించిన ఆయన, సంబంధిత మున్సిపల్ కార్పొరేషన్ అధికారులకు సమాచారం అందించారు.గద్దె క్రాంతి కుమార్ సూచనలతో అధికారులు తక్షణమే చర్యలు తీసుకుని డ్రైనేజీలను శుభ్రం చేయించారు. ఈ సందర్భంగా గద్దె క్రాంతి కుమార్ మాట్లాడుతూ, ప్రజల ఆరోగ్యానికి ముప్పుగా మారే ఇటువంటి సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా వెంటనే పరిష్కరించడం అధికారుల బాధ్యత అని పేర్కొన్నారు. ప్రజలకు ఇబ్బంది కలిగే ప్రతి అంశంపై తాము ఎప్పటికప్పుడు స్పందిస్తామని తెలిపారు. అనంతరం గురువారం రాత్రి టీడీపీ పార్టీ నాయకులు బలగాని శ్రీనివాస రావు తల్లి చనిపోయారు. ఆమె భౌతికకాయానికి గద్దె క్రాంతి కుమార్ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు కొక్కెర తిరుపతయ్య, రాయి రంగమ్మ, మైలమూరి పీరుబాబు, తలపాటి ప్రసాద్, దేవళ్ళ శ్రీను, పోలిపల్లి ముని, పగడాల వెంకటేశ్వర రెడ్డి, కొండా, గంధ్ర రాజు, మద్ది రామారావు, ఖాళీలతో స్థానిక పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అంగన్వాడీ కేంద్రంలో పోషణ పక్వాడ కార్యక్రమం






**గూడూరు,ఏప్రిల్ 10 వుదయం ప్రతినిధి:**

పోషణ పక్వాడా కార్యక్రమంలో భాగంగా ప్రతి సంవత్సరం నిర్వహించడం జరుగుతుందనీ అందులో భాగంగా 9వ తేదీ నుండి 23వ తేదీ వరకు ప్రతి అంగన్వాడి కేంద్రం నందు నిర్వహించబడతాయనీ ఐసిడిఎస్ ఎ సి డి పి ఓ శారద పేర్కొన్నారు.గూడూరు ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోని అశోక్ నగర్ సెక్టార్ నందలి అరుంధతివాడ అంగన్వాడి కేంద్రం నందు తల్లులను సమావేశపరిచి నిర్వహించడం జరిగింది. ఈ సమావేశంలో సిడిపిఓ మహబూబి పోషణపై చర్చించారు. గర్భధారణ సమయంలో ఆహారం మరియు సంరక్షణ గర్భిణీ పరీక్షల ప్రాముఖ్యత గర్భధారణ సమయంలో సరైన బరువు పెరుగుదల బిడ్డ పుట్టిన వెంటనే తల్లిపాల ప్రాముఖ్యత సరైన వయసులో అనుబంధ ఆహారం ప్రారంభించడం మొదలైన వాటి మీద సూచనలు ఇచ్చారు అనంతరం ఏ సి డి పి ఓ శారదాంబ మాట్లాడుతూ పిల్లలకు జంక్ ఫుడ్ మరియు ప్యాకేజీ ఆహార పదార్థాలు తినిపించకూడదని వాటి వల్ల తలెత్తే సమస్యలను వాళ్లకి వివరించారు అంతే కాకుండా మన సాంప్రదాయం వంటలను పిల్లలకు అలవాటు చేయాలని చెప్పారు. సూపర్వైజర్ ఆర్. సుజన మాట్లాడుతూ పిల్లలకు ఆహారం పెట్టేటప్పుడు సెల్ ఫోన్లు టీవీలు చూపిస్తూ వాళ్లకి అలవాటు చేయకూడదని మంచి అలవాట్లు అంటే వాళ్ళని తిప్పుతూ ఆ పిల్లలకి బొమ్మలు చూపిస్తూ కథలు చెబుతూ అదేవిధంగా చందమామను చూపిస్తూ తినిపించాలని చెప్పడం జరిగింది. అదేవిధంగా ఇప్పుడు పిల్లలకి బంధుత్వాలు అంటే తెలియకుండా పోతున్నాయి. బంధాలు అనుబంధాల గురించి కూడా పిల్లలకి తెలియజేస్తూ వాళ్ల మధ్య పెరిగేలా ప్రోత్సహించాలని తెలియజేశారు. అనంతరం ర్యాలీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు మస్తానమ్మ, మహేశ్వరి,పద్మ ప్రేమకుమారి పాల్గొన్నారు.

# అత్యాధునిక వైద్య విధానం



- సుస్థిర ఆరోగ్య కోసం హోమియోపతి వైద్యం-పీఎంపీ, ఆర్ఎంపి (గ్రామీణ వైద్యులు)

**నెల్లూరు (వుదయం ప్రతినిధి) :**

ఏప్రిల్ 10 తేదీ డాక్టర్ వై. శ్రీనివాసరావు, సీనియర్ హోమియో వైద్యులు, అసిస్టెంట్ ప్రొఫెసర్ డిపార్ట్మెంట్ ఆఫ్ అనాటమి. కమ్యూనిటీ పారామెడిక్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నెల్లూరు మరియు ది పిఎంపి అసోసియేషన్ ఆఫ్ ఇండియా సంయుక్త ఆధ్వర్యంలో ప్రపంచ హోమియోపతి దినోత్సవాన్ని పురస్కరించుకొని దర్గామిట్ట, మోడరన్ హోమియోపతి హాస్పటల్ సమావేశ మందిరం నందు హోమియోపతి పితామహుడు డాక్టర్ క్రిస్టియన్ ఫెడరిక్ శామ్యూల్ హనిమన్ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించడం జరిగినది.అనంతరం హోమియోపతి వైద్య విధానంపై నెల్లూరు నగరంలోని పిఎంపి, ఆర్ఎంపి, గ్రామీణ వైద్యులకు హోమియోపతిపై అవగాహన సదస్సు జరిగినది. ఈ కార్యక్రమానికి సీనియర్ హోమియో వైద్యులు, అసిస్టెంట్ ప్రొఫెసర్ డిపార్ట్మెంట్ ఆఫ్ అనాటమి డాక్టర్ వై.శ్రీనివాసరావు పాల్గొని మాట్లాడుతూ ఆధునిక వైద్య విధానం, సుస్థిర ఆరోగ్యం కోసం హోమియోపతి వైద్యం అనుకూలమైన పర్యావరణం, దీర్ఘకాలిక ఆరోగ్య పరిష్కారాలను అందించడంలో హోమియోపతి యొక్క ప్రాముఖ్యతను తెలియజేస్తుందన్నారు. హోమియోపతి పితామహుడు డాక్టర్ క్రిస్టియన్ ఫెడరిక్ శామ్యూల్ హనిమన్ 271 వ జయంతి పురస్కరించుకొని ఈ దినోత్సవంను ప్రపంచమంతా జరుపుకుంటారని అన్నారు. హోమియోపతి అనేది 18వ శతాబ్దం చివరలో జర్మన్ వైద్యుడు డాక్టర్ క్రిస్టియన్ ఫెడరిక్ శామ్యూల్ హనిమన్ అభివృద్ధి చేసిన ఒక ప్రత్యామ్నాయ వైద్య విధానం అని ఇది సమానమైనది, సమానమైన దానిని నయం చేస్తుందనే సూత్రంపై ఆధారపడి ఉంటుందన్నారు. ఈ సూత్రం ప్రకారం ఆరోగ్యంగా ఉన్న వ్యక్తిలో లక్షణాలను కలిగించగల ఒక పదార్థాన్ని పలుచని రూపంలో ఉపయోగించి అనారోగ్యంతో ఉన్న వ్యక్తిలోని అటువంటి లక్షణాలకు చికిత్స చేయవచ్చని అన్నారు హోమియోపతి మందుల తయారీలో సకషన్ అని పిలవబడే క్రమనుగత విలీనికరణ మరియు తీవ్రమైన కదలిక ప్రక్రియ ఉంటుందన్నారు. పోటెంటైజేషన్ అని పిలువబడే ఈ ప్రక్రియ సంభావ్య దుష్ప్రభావాలను తగ్గించి మందు యొక్క ప్రభావాన్ని పెంచుతుందని, నేటి హోమియోపతి వైద్యులు దీనిని ప్రగాఢంగా నమ్ముతారని అన్నారు. అనంతరం పిఎంపి, ఆర్ఎంపి నాయకులు సీనియర్ హోమియోపతి వైద్యులైన డాక్టర్ షేక్ సిరాజ్, డాక్టర్ వై. శ్రీనివాసరావు. ఏ. కిరణ్ కుమార్ రాజు, డాక్టర్ ఆర్. పావనిదేవి లను శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పీఎంపీ నాయకులు శాఖవరపు వేణుగోపాల్, గోరంట్ల శేషయ్య, దేవరకొండ శ్రీనివాసులు, నంద్యాల మాలిని, ఐ. నాగరత్న, ఎం. శ్రీధర్ రావు, బి. శంకర్రావు, రమేష్, కమ్యూనిటీ పారా మెడిక్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు షేక్ రఫి, ఏ. ప్రసాద్, ప్రశాంతి, మోడరన్ హోమియో హాస్పిటల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# మాజీ సీఎం రాకకు హెలిపాడ్ ఏర్పాట్లు

- మత్స్యకారులకు వైసిపి అండగా ఉంటుంది
- మాజీ శాసనసభ్యులు ప్రతాప్ కుమార్ రెడ్డి

**కావలి, ఏప్రిల్ 10, వుదయం ప్రతినిధి:**

ఈనెల 15వ తేదీన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రివర్యులు, వైఎస్ఆర్సిపి పార్టీ అధినేత వైయస్ జగన్మోహన్ రెడ్డి జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ సందర్శించడానికి మరియు మత్స్యకారులకు భరోసా కల్పించడానికి విచ్చేయుచున్న సందర్భంగా హెలిపాడ్ స్థల ఏర్పాట్లను కావలి నియోజకవర్గం మాజీ శాసనసభ్యులు మరియు నియోజకవర్గ వైఎస్ఆర్సిపి ఇన్చార్జ్ రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి శుక్రవారం పరిశీలించారు. పరిశీలించిన అనంతరం జగన్మోహన్ రెడ్డి పర్యటన వివరాలను మీడియా ముఖంగా వెల్లడించడం జరిగింది. మత్స్యకారులకు వారి అభ్యున్నతికి వైసిపి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన పేర్కొన్నారు ఆయన వెంట పలువురు వైసిపి నాయకులు ఉన్నారు.

# మనబడి-జ్ఞానబాట ర్యాలీ





**ఆత్మకూరు రూరల్, చేజర్ల (వుదయం ప్రతినిధి) :**

ఏప్రిల్ 10వ తేదీ చేజర్ల మండలంలో మనబడి జ్ఞాన బాట కార్యక్రమంలో భాగంగా మండల విద్యాశాఖ అధికారులు ఎన్రోల్మెంట్ ర్యాలీని ప్రారంభించడం జరిగింది. ప్రభుత్వ పాఠశాలలో అనేక సౌకర్యాలు కల్పించబడుతున్నాయి ఉచిత యూనిఫామ్, పాఠ్యపుస్తకాలు నోట్ బుక్స్ మరియు షూలు అందజేయడం జరుగుతుంది రుచికరమైనటువంటి, పోషకాలతో కూడిన మధ్యాహ్న భోజనం అందించడం జరుగుతుంది. కావున ప్రతి ఒక్క తల్లిదండ్రులు తమ యొక్క పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించి వారి భవిష్యత్తును బంగారు బాటలో మళ్లించమని విజ్ఞప్తి చేయుచున్నాము. మండలంలోని అన్ని ప్రాథమిక మరియు హైస్కూల్లో పాఠశాలల యందు ర్యాలీని నిర్వహించడం జరిగింది . ఈ కార్యక్రమంలో అన్ని పాఠశాలల ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

